# దేశమంటే మతాలోయ్

కారు కదిలింది.

కన్నీటి తెరల్లో అందరూ మరుగైపోయారు.

నేను చండీఘర్ వదలాల్సి వస్తుందని ఎప్పుడూ అనుకోలేదు.

కానీ... మనసంతా కెలికినట్లయింది.

పక్కకి చూశాను.

నా భార్య మనూ, వెనక్కి తల వాల్చుకుని కళ్ళు మూసుకుంది.

మూసుకున్న రెప్పల కింద నుంచి, చెంపల మీదుగా జారుతున్న కన్నీళ్ళు.

"ఏడవకు" అని నేననలేదు.

"కళ్ళు తుడుచుకో" అని అనలేదు. అనలేకపోయాను. మరి నాదీ అలాటి స్థితే.

అన్ని సెక్టర్స్‌లోంచి మా కారు వెళ్తోంది. నేనే డ్రయివర్‌తో అన్నా - ఓసారి అన్ని సెక్టర్స్‌లోంచి తీసుకెళ్ళమని.

ప్రతి సెక్టర్‌లో అమిత్ గుర్తొస్తున్నాడు...

హోటల్ కపిల్, రోజ్‌గార్డెన్స్, రాక్‌గార్డెన్స్, క్రికెట్ కోచింగ్ సెంటర్, సెక్టర్ 17 షాపింగ్ సెంటర్, పికాడెల్లి. ప్రతిచోటా తిరిగాం. తిరిగిన ప్రతి క్షణంలోని అన్ని రకాల అనుభవాలు అందరం కలిసి పంచుకున్నాం.

కానీ... ఈనాడు... ఈ వయసులో ఆ జ్ఞాపకాలే మిగుల్తాయని అనుకోలేదు. చండీఘడ్ దాటాం, ఎంతో బరువైన మనసుతో ఆరోడ్లో ఎన్నోసార్లు ఢిల్లీ వెళ్లారు. కానీ

ఎప్పుడూ ఢిల్లీ వెళ్తున్నా నున్నగా మెరుస్తున్న తారురోడ్డు, రెండు వైపులా ఉన్న యూకలిప్టస్ చెట్లు, వాటి తర్వాత కనుచూపు మేర వరకూ కనబడే పచ్చటి పొలాలు చూస్తుండేవాణ్ని. ఢిల్లీ ఎప్పుడు వచ్చిందో తెలీనంతమైకంలో ఉండేవాణ్ణి.

కానీ... ఈవేళ...అన్యాయంగా, అమాయకుడైన నా కొడుకుని చంపిన వాళ్ళమీద దాతకాని కోపంతో వున్నాను.

సరిగ్గా అరవై రోజుల క్రితం డ్యూటీలో చేరడానికి లేహ్‌కు బయలురేదాడు బస్సులో కొడుకు అమిత్. చండీఘడ్ నుంచి జమ్మూ వెళ్ళి అక్కడి నుంచే లేహ్ వెళ్ళాలి. కానీ, అమిత్ జమ్మూ చేరనేలేదు. ఆ బస్సులోని వాళ్ళందర్నీ ముగ్గురు టెర్రరిస్టులు స్టెన్‌గన్‌తో నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపేశారు.

దేశ రక్షణ కోసం ఆర్మీలో చేరాడు. కానీ మామూలు బస్సు ప్రయాణంలోనే వాడికి రక్షణ లేకపోయింది.

ఆ తుపాకీ గుళ్ళు శరీరంలోకి వెళ్తూంటే ఎంత బాధపడ్డాడో నా తండ్రి. మృత్యుదేవత రూపం ఎంత భయంకరంగా ఉంటుందో ఆ రోజున అక్కడికి వెళ్లినపుడు తెలిసింది. కింద మట్టిలో కలిసిపోతున్న రక్తం చూస్తే తెలిసింది.

ఖలిస్తాన్ కావాలంటే ఇదా మార్గం?

అంత పెద్ద శిక్కు రాజ్యాన్ని స్థాపించిన రంజిత్‌సింగ్ హిందువుల్ని ఎంతో గౌరవించాడు.

గురునానక్ స్థాపించిన రిలిజియన్ ఆఫ్ ప్రొటెక్ట్‌ఏది? ఏమైంది? గురు అర్జున్‌సింగ్ నిర్మించిన ఆ పవిత్ర దేవాలయంలో ఏం జరుగుతుందో, ఏం దాస్తున్నారో, ఈనాడు ఆయన అడుగుజాడల్లో నడిచేవారికి తెలీదా? ఆలోచిస్తూనే కళ్ళు మూసుకున్నాను.

ఒక్కసారి గతం కళ్ళముందు నిలిచింది...

అతి కష్టం మీద స్కూల్ ఫైనల్ పాసయ్యాను. 'ఎయిర్‌ఫోర్స్‌లో జాయినయ్యాను. బెంగుళూరు ట్రైనింగ్‌కు వెళ్ళాను. మొదటి పోస్టింగ్ అస్సాం. తర్వాత శ్రీనగర్, ఆ తర్వాత చండీఘడ్. అక్కడే వాలియా అనబడే శిక్కుతో పరిచయం అయింది. వాలియాకి ఒక చెల్లెలుంది. తల్లి దండ్రులు లేరు. పినతండ్రి దగ్గర పెరిగారు. శెలవు వచ్చినపుడల్లా వాలియా ఇంటికి వెళ్ళేవాణ్ణి. చండీఘడ్ రోడ్లల్లో వాలియా ఇంటికి వెళ్తూ చాలా హాయిగా ఫీలయ్యేవాణ్ణి. వాలియాతోనూ, అతని చెల్లెలు మంజిత్‌కౌర్‌తోనూ గంటలకొద్దీ కబుర్లు చెప్తూ గడిపేవాణ్ణి.

చండీఘడ్ నాకెంతో వచ్చింది. అన్ని ఇళ్ళూ ఒక్కలాగే ఒకే రంగులో వుంటాయి. ప్లాన్డ్ సిటి. గుబురు చెట్లలోంచి తొంగి చూసే జేగురు రంగు ఇళ్ళు. మొదటి నుంచి పంజాబ్‌కి కాపిటల్. అప్పుడే, హర్యానా రాష్ట్రం అవతరణకు సన్నాహాలు జరుగుతున్నాయి. హర్యానాకి కూడా అదే కాపిటల్ అవుతుందని తెలుసు.

ఆ వాతావరణం, ఆ పంజాబీ తిండి నాకు బాగా నచ్చింది. చండీఘడ్‌లో ఇంకా నచ్చింది వాలియా చెల్లెలు మంజీత్‌కౌర్. టిపికల్ శిక్ అమ్మాయిలాగా తెల్లగా, పంజాబీ డ్రెస్‌లో, బిగించి వేసిన జడతో అందంగా ఉండేది.

ఎయిర్‌ఫోర్స్ ను ంచి రిటైరయ్యాను నా ముప్పయి రెండవ ఏట.

చండీఘడ్‌లోనే ఉండిపోవడానికి నిశ్చయించుకున్నాను.

స్పోర్ట్స్ గూడ్స్ బిజినెస్ చెయ్యడం మొదలు పెట్టాను.

మంజీత్‌తో స్నేహం పెరిగింది.

వాలియా మా స్నేహాన్ని చూసీ చూడనట్లుండేవాడు.

మా ఇద్దరి స్నేహం పెళ్లికి దారితీసింది. వాలియా దానికి అభ్యంతరం చెప్పలేదు. ఆ విషయమే ఇంటికి రాశాను.

నాన్నగారు తిడ్తూ రాశారు. ఆయన తిట్లు నాకు కొత్తకాదు. చదువు సరిగా చదవనని, మార్కులు రావని ఆయన రోజూ నన్ను తిట్టేవారు ఆరోజుల్లో.

"చదువు సరిగా రాకపోయినా, ఉద్యోగం మంచిది వచ్చిందని సంతోషించాము. కానీ ఎక్కడా పిల్లలే దొరకనట్లు ఆ పిల్లేమిటి?" అని అమ్మరాసింది.

"బేసిక్ కల్చర్‌లోనే చాలా తేడావున్నప్పుడు ప్రతిరోజూ ప్రతి గంట, ప్రతి నిమిషం కలిసి ఎలా గడపగలరు? ఈ నీ పెళ్ళిమీద, ఆ తర్వాత నీ జీవితం ఆధారపడి ఉంది. అది బాగా గుర్తు పెట్టుకో"అని అన్నయ్య రాశాడు.

కానీ ఎవరు ఏమనుకున్నా నేను ఈ పెళ్ళి చేసుకోవాలనుకున్నాను. వాలియా సపోర్ట్ ఉంది. అందువల్ల మా పెళ్ళి అయిపోయింది. చిన్న ఫ్లాట్ తీసుకున్నాం. పంజాబ్ అంతా చెట్టాపట్టాలేసుకుని, కీరత్‌పూర్ సాహెబ్ వెళ్ళాం. అమృతసర్ వెళ్ళాం.

అలాగే పంజాబ్‌లో ఉన్న ఎన్నో హిందూ దేవాలయాల్ని మేం సందర్శించాం. జమ్మూ దగ్గరలో ఉన్న వైష్ణోదేవి దేవాలయానికి వెళ్ళాం ఎన్నో వ్యయప్రయాసలకోర్చి. అప్పుడే మాకో అబ్బాయి పుట్టాడు. మా పెళ్లికి మతం అడ్డుకాలేదు. నా పిల్లలు కూడా

అదే దారిలో నడవాలని మా ఆశ. అందుకే వాణ్ణి శిక్కు మత ప్రకారంగా పెంచాలనుకున్నాం. జుట్టు తీయించలేదు. పేరు కూడా "గురుమీత్‌సింగ్" అని పెట్టాం. ఒకవేళ పాప పుట్టినా "గురుమీత్ కౌర్"అని పెట్టేవాళ్ళం. మగ పిల్లలకి "సింగ్" ఆడపిల్లలకి "కౌర్" అని పేరు పక్కన తప్పకుండా ఉండాలి. అది శిక్కు పద్ధతి. ఆ విషయమే ఇంటికి వ్రాశాను. అది ఎన్నో నెలల తర్వాత నే రాసిన ఉత్తరం నాన్నగారికి, జవాబు నేననుకున్నట్టే వచ్చింది. "అసలు ఎలాటి కుటుంబం మనది? మా తాత ఘనాపాటి! మా చిన్న తాత సోమయాజులు, అహితాగ్నుల కుటుంబం. అలాటి కుటుంబంలో పుట్టిన నువ్వు ఆ సిక్కుల్లో కలిసిపోయావా! సిగ్గులేకుండా కొడుకుని కూడా అలాగే చేస్తున్నావా? ఇక మీదట ఇలాటి వెధవ్వుత్తరాలు రాయకు. నువ్వుపుట్టలేదని అనుకుంటా"అంటూ నాన్నగారి దగ్గర్నించి ఉత్తరం వచ్చింది. మరికొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి హాయిగానే.

ఆ తర్వాత మరో కొడుకు పుట్టాడు. తిరుపతి వెళ్ళాం. జుట్టు తీయించాం. "అమిత్" అని పేరుపెట్టాము. ఆ తర్వాత నుంచి మనూ చీరెలు కట్టుకోవడం, బొట్టు పెట్టుకోవడం మొదలెట్టింది.

చీరె కట్టడం, బొట్టు పెట్టుకోవడం శిక్కు మత విరుద్ధం.

నా బిజినెస్ వృద్ధి చెందింది. పిల్లలిద్దర్నీ స్కూల్లో వేశాం. ఏ పొరపొచ్చాలు లేకుండా, ఒకే గూటికింద ఒకేదార్లో రెండు మతాల వాళ్ళం నడుస్తుంటే మా సెక్టర్‌లో అంతా మెచ్చుకునేవాళ్ళు. "గురుపర్ ఖాస్"లకి గురుద్వారాకి వెళ్ళేవాళ్ళం. "లంగర్"లో భోంచేసే వాళ్ళం.

పిల్లలు కూడా పెద్ద వాళ్ళయ్యారు. మాలాగే మనిషిని మనిషిగా చూడటమే నేర్చాం.

నాన్నగారు పోయినపుడు టెలిగ్రాం వస్తే నేనొక్కణ్ణే వెళ్లాను. మనూని కూడా తీసుకురావాల్సిందని అన్నయ్య, వదిన, ఆఖరికి అమ్మకూడా అంది.

నాన్నగారు పోయిన ఏడాదిలోపుగానే పెద్దన్నయ్య కూతురికి పెళ్లి జరిగింది. మనూని తప్పకుండా తీసుకురమ్మని రాశారు. అదే సమయానికి అమిత్‌కి సుస్తీచేస్తే నేనొక్కణ్ణే హైదరాబాద్ వెళ్ళొచ్చాను. మా ఇంటిలో అందరూ అడిగారు నా కుటుంబ సభ్యుల గురించి ఎంతో ఆసక్తిగా, పెద్దవాడు వాడి తల్లి మతాన్ని, రెండోవాడు నా

మతాన్ని స్వీకరించారు మా అభిమతంపై అని చెప్పినపుడు మా ఇంట్లో అందరూ బాహాటంగా మెచ్చుకున్నారు, నాలో అంతర్గతంగా ఉన్న సర్వమత సమానత ధ్యేయాన్ని ప్రశంసించారు.

పెద్దవాడు గురుమిత్‌కి సరిగ్గా చదువబ్బలేదు. అందుకని పాత ఢిల్లీలో రేడియోల షాపు పెట్టించాము. కారు కొన్నాను. నా బిజినెస్ బాగా నడుస్తోంది. ఆ తర్వాత అమిత్ ఆర్మీలో జాయినయ్యాడు సెకండ్ లెఫ్టినెంట్‌గా. తర్వాత కేప్టెన్ అయ్యాడు.

నా కొడుకు లిద్దరూ జీవితంలో సెటిలయ్యారు. నాకింతకంటే కావల్సిందేమిటి? నా జీవితం నేననుకున్నట్లే స్మూత్‌గా వెళ్తోంది, అని అనుకున్నాను.

దీపావళికి అమిత్ 'లేహ్' నుంచి వచ్చాడు. చాలా సరదాగా దీపావళి జరుపుకున్నాం. ఓ రోజు పింజోర్ గార్డెన్స్ వెళ్ళాం. ప్రతి రోజూ రాత్రి భోంచేసి గంటల కొద్దీ కబుర్లు చెప్పుకొనేవాళ్ళం. అమిత్ సెలవులయిపోవడంతో జమ్మూ వెళ్లడానికి 'పంజాబ్ రోడ్‌వేస్' బస్సునేనే ఎక్కించి వచ్చాను చండీఘడ్ బస్టాండ్‌లో.

అప్పుడే విధి మా చక్కటి కుటుంబంపై దెబ్బకొట్టింది.

ఆ బస్సు జమ్మూ చేరలేదు.

అందులోని పాసింజర్స్‌ని, జాలిగా, భయంగా ఏడుస్తుంటే ఆ ఆక్రందనల మధ్య, కొన్ని కోట్ల కన్నీటినదులు కాల్వలు కడ్తుంటే రాక్షసంగా చంపేశారు ఖలిస్తానీయులు.

మిలట్రీ డ్రెస్‌లోనే ఉన్నాడు. కాబట్టి అమీత్ బాడీని పోస్ట్‌మార్టం చేసిన ఆ మాంసపు ముద్దని గుర్తుపట్టగలిగాను. లేకపోతే నా కొడుకు కాదనుకొనేవాణ్ణి. అన్నయ్యకి టెలిగ్రాం ఇచ్చాను.

నా భార్యకి స్పృహలేదు. మా పెద్దవాడు గుండెలవిసేటట్లు ఏడుస్తున్నాడు. నా రక్తం పంచుకుని పుట్టిన నా చిన్నకొడుకుని, ఓ విధంగా శిక్కులు కాల్చి మిగిల్చిన ఆ శరీరాన్ని నేనింకో విధంగా కాల్చాను చితిపై. మా సెక్టర్‌లో వాళ్లూ, ఎం.ఎల్.ఏలూ, రూలింగ్ పార్టీవాళ్లూ, అపోజిషన్ పార్టీ వాళ్లూ అందరూ వస్తున్నారు. వెళ్తున్నారు. నాకు వాళ్లెవరూ కూడా తెలీదు. నాకు రాజకీయాల్తో సంబంధం లేదు. నా సంబంధం అంతా మానవత్వంతోనే. కానీ జరిగిన హింసాకాండని, మనిషన్న వాడు సహించలేక పోతున్నాడు. రోజూ పేపర్లో, టీవీలో, రేడియోలో ఇవే వార్తలు.

ఆ టెర్రరిస్టుల్ని ఎప్పటికీ పట్టుకోలేకపోయారు. హైదరాబాద్ నుంచి మా కుటుంబ సభ్యులంతా వచ్చారు.

"నీకు, నీ పిల్లలకు సరైన రక్షణ లేనిచోట ఇంక ఉండకు. జరిగింది జరిగినట్లు మాట్లాడుకోవడానికి వీలులేని పరిస్థితి. కారణం ఏమిటో తెలిసి కూడా మనభావాలు చెప్పుకోడానికి వీల్లేదు. ఎవరు విని ఏం చేస్తారో అని భయం. భయం భయంగా ఎన్నాళ్లు? హైదరాబాద్ వచ్చెయ్యి" అని వెళ్తూ చెప్పారు.

కానీ మాకు గురుమీత్ దగ్గర ఉంటేనే బావుంటుందనిపించింది. మా ఆశలు, మా భవిష్యత్తు అంతా ఇకవాడే. వాడికి పెళ్లి చెయ్యాలి. వాడి పిల్లల్ని మేము చూసి ఆనందించాలి. ఆ జీవితం ఒక్కటే కాస్త మనశ్శాంతి నిస్తుంది నాకూ, మనూకి, అప్పుడే ఢిల్లీకి నా మకాం మార్చేయాలని నిశ్చయించుకున్నాం.

ఒక్కసారి కార్ల శబ్దాలు, స్కూటర్ల శబ్దాలు గట్టిగా వినబడ్డే కళ్ళు తెరిచాను. నా ఆలోచన్ల నుంచి తేరుకున్నాను. సాయంత్రం అవుతోంది. ఢిల్లీకి చేరుకున్నాం.

"చండీఘడ్‌లో నా దుకాణం, ఇల్లు అమ్మేసి ఢిల్లీ కొచ్చేస్తున్నాం"అని ముందే గురుమీత్‌కి రాశాను. ఏ రోజున వస్తున్నామో కూడా రాశాను.

మా కోసమే చూస్తున్నట్లున్నాడు. ఇంటి ముందుకారు ఆగగానే సామాన్లు ఒక్కక్కొటే తీస్తున్నాడు కార్లోంచి.

"కీ హాల్ హై పప్పా!" అంటూ ఎప్పటిలాగే అమిత్‌కూడా లోపల్నించి వస్తాడేమో అని అనిపించింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి మా ఇద్దరికీ, మా ఇద్దరిలో అన్ని విషయాల్లోనూ సయోధ్య ఉందన్నట్టు. ఆరోజు గుర్తుకొచ్చింది...

గురుమిత్ ఢిల్లీలో షాపు పెట్టాక ఈ ఫ్లాట్ కొన్నాం. ఆ ఇంటి గృహప్రవేశం చేసిన రోజున అమిత్‌దే అంతా హడావుడి. ఆ రోజు ఎంత సందడి!

కానీ...ఈవేళ ఎంతటి నిశ్శబ్దం. అమిత్ మరణంతో మేము మాటలో మర్చిపోయాం.

ఇంట్లో ఓ గఢవలీ వంటవాడున్నాడు. వాడు టీ తీసుకొచ్చాడు. మౌనంగానే టీ తాగాం.

"నేను ఎనిమిది గంటలకి షాపు మూసేసి వస్తాను. మీరు రెస్ట్ తీసుకోండి. మమ్మీకి కావాల్సిన మందులేమైనా లేకపోతే తెస్తాను" బయటకి వెళ్తూ అన్నాడు గురుమీత్.

"మందులన్నీ ఉన్నాయికానీ, నువ్వింకా పెందరాళే రా"అని మెల్లగా అన్నాను.

"సరే" అంటూ వెళ్ళిపోయాడు.

అమిత్ పోయిన తర్వాత మనూకి హిస్టీరియా వచ్చింది. అప్పటినుంచి నిద్రమాత్రలు వాడాల్సొస్తోంది. అందుకని ఎప్పుడూ మత్తుగా, మౌనంగా ఉంటుంది.

లేకపోతే నిద్రపోతూ ఉంటుంది. స్నానం చేసి, బాల్కనీలో కూచున్నాను. చీకటి పడుతోంది. లైటు వేసుకోలేదు. వేసుకోవాలనిపించలేదు.

నిశ్శబ్దంగా మనసుతో ఏడవటానికి ఈ చీకటి బావుంటుంది. చెదిరిపోయిన జీవితంలో అసంపూర్తిగా మిగిలిపోయిన నా అమిత్ గురించి నేను కన్న కలల గురించి.

బలవంతంగా నేలరాలిన పువ్వులాంటి నా కొడుకుని గురించి ఆలోచించడానికి ఈ చీకటి బావుంటుంది. ఇంత చక్కటి చీకటిని సృష్టించిన ఆ జాలి లేని దేవుణ్ణి మెచ్చుకోవాలి. ఎంతసేపు అలా ఆలోచిస్తూ కూచున్నానో నాకే తెలీదు. బాల్కనీలో లైటు వెలిగింది. స్విచ్‌బోర్డు దగ్గర గురుమిత్ నుంచుని చూస్తున్నాడు.

నా చెంపల మీద కన్నీళ్ళు.

నాకు తెలీకుండానే ఏడ్చాను "పప్పా" అంటూ కింద కూచుని తలని నా ఒళ్లో పెట్టుకున్నాడు. వాడితల నిమురుతూ ఉండిపోయాను.

ఢిల్లీ వాతావరణంలో శేష జీవితం గడపడానికి మెల్లగా అలవాటు పడ్తున్నాం. రోజులు గడుస్తున్న కొద్దీ అమిత్ జ్ఞాపకాలు మరుగవుతున్నాయి.

మనూ ఆరోగ్యం ఈ మధ్య బాగుపడింది. కాస్త మాట్లాడుతోంది. కాశీ, హరిద్వార్, బద్రీనాథ్ వెళ్తే బావుంటుందని మా కనిపించింది. ఆ తర్వాత మా షాపునే ఇంకా పెద్దదిగా చెయ్యాలా, లేకపోతే ఇంకోషాపు పెట్టాలా అని ఆలోచించొచ్చులే. అయినా గురుమీత్ షాపు బాగా పెద్దదే. ఇప్పుడు కలర్ టీవీలు "డెక్"లు కూడా అమ్ముతున్నాడు. యాత్రల నుంచి వచ్చాకనే ఏదైనా నిర్ణయించాలి. నా మనస్సు డైవర్ట్ చేసుకోవాలి. మనూ ఎప్పుడూ గ్రంథసాహెబ్ చదువుతూ ఉంటుంది. అది కాకపోతే నిద్ర. ఆమెది అదో అవస్థ. ఆమె మనసు ఎప్పుడో డైవర్ట్ అయింది.

ఒకరోజు బాల్కనీలో కూర్చుని టీ తాగుతున్నాం. అకస్మాత్తుగా రోడ్లో ఏదో మార్పు కనబడింది. హడావుడి, మనుషుల్లో వేగం. షట్టర్లు వేస్తున్న శబ్దాలు. చిన్న చిన్న గుంపులుగా జనం. రోడ్డు చివర అప్పుడే ఆగిన పోలీస్‌వాన్. అందులోంచి దిగుతున్న పోలీసులు.

ఏదో జరిగిందనిపించింది. కుర్చీలోంచి లేచాను.

నేను బాల్కనీ గోడని ఆనుకుని బయటికి చూస్తున్నాను. ఈ లోపల పక్క బాల్కనీలోకి ఆ ఇంటావిడ వచ్చింది. ఆమెతో పరిచయం లేదు కానీ ఏం జరిగిందోనన్న కుతూహలం కొద్దీ అడిగాను.

"మీకింకా తెలీదా! ఇందిరాగాంధీని ఎవరో కాల్చి చంపేశారట. ఎవరు చేశారో ఇంకా తెలీదు. ఇప్పుడే మా మిస్టర్ ఫోన్ చేసి చెప్పారు"అంది పంజాబీలో.

ఒక్కసారి ప్రపంచం గిర్రున తిరిగినట్లయింది.

కళ్ళప్పగించి మామూలుగా అయి లోపల్నించి రేడియో తీసుకొచ్చి బాల్కనీలో పెట్టి ఆన్ చేసి తిరిగికూచున్నాను.

ఇందిరాగాంధీ మరణించిందని ఎవరు కాల్చిచంపారో కూడా చెప్పారు, దాదాపు మధ్యాహ్నానికి.

ఈ దేశాన్ని ముక్కలు కాకుండా కాపాడ్తానని ఎన్నో ప్రమాణాలు చేసి, ప్రయాసల కోర్చిన ఇందిరమ్మ ఈనాడు వేర్పాటువాదుల తుపాకీ గుండ్లకు గురైపోయింది...

మరోసారి అమిత్ శవం నా కళ్ళ ముందు మెదలింది.

ఇలా ఎందరో, ఎందరెందరో రోజూ టెర్రరిస్టుల మత పిశాచానికి బలైపోతున్నారు. చివరికి ఒరిగేదేమిటి?

మనూ శూన్యంలోకి చూస్తోంది. నాకు తెలుసు. ఆ చూపులకి తర్వాత స్టేజ్ ఫిట్స్. మనూ అమిత్ గురించి ఆలోచిస్తోంది.

ఈ టెర్రరిజాన్ని అంతం చెయ్యలేకపోతున్నారెందుకని?

ఏదో ఓ బలమైన చెయ్యి పటపటా ఈ టెర్రరిజాన్ని నలిపేయకూడదూ!

గురు అర్జున్‌సింగ్‌ని జహంగీర్ టార్చర్ చేశాడు.

గురు గోవింద్‌సింగ్‌ని ఓ పఠాన్ చంపాడు.

1746 జూన్‌లో, 1762 ఫిబ్రవరిలో జరిగిన గల్లూఘారాల్లో కొన్నివేలమంది సిక్కులు మరణించారు. అందులో నుంచే నేర్చున్నారా! తమ మతాన్ని కాపాడుకోడానికి ఏమైనా చెయ్యాలని "బతకటం అంటే వీరులుగా బతకాలి" అంటే దాని అర్థం ఇదా?

సాటి సోదరులన్న ప్రేమ లేకుండా, జరుగుతున్న మారణహోమం, ఈ మతావేశం దేనికి దారితీస్తుందో!

పూజ చేస్తున్న గోడల్ని అడ్డుపెట్టుకుని, రక్తం చిందిస్తుంటే ఎలా ఊరుకోవడం!

ఆలోచిస్తున్న కొద్దీ నా తల బరువెక్కడం మొదలెట్టింది.

మనూ కేసి చూశాను. చలనం లేకుండా కళ్ళు ఆర్పకుండా చూస్తున్నా మనూని చూస్తే భయం వేసింది. గబగబా లో[illegible]ల్లి ట్యాబ్లెట్ ఇచ్చాను. ఎలాంటప్పుడు ఏ మాత్ర ఇవ్వాలో నాకు బాగా తెలిసిపోయింది. ఆమెను తీసుకెళ్ల [illegible]నం మీద పడుకోబెట్టాను.

ఆ రోజు గురుమీత్ భోజనానికి చాలా ఆలస్యంగా వచ్చాడు. కొంచెంసేపు ఇందిరాగాంధీ గురించే మాట్లాడుకున్నాం. ఆ తర్వాత మామూలుగా, ఇదివరకులాటి గంభీర్య ఇంటి వాతావరణంలోకి వచ్చేసింది.

ఆ మర్నాడు గురుమీత్ మామూలుగానే షాపు కెళ్లాడు. కానీ మధ్యాహ్నం భోజనానికి రాలేదు. షాపుదగ్గరే కాబట్టి నేనే టైం కాల్క్యులేట్ చేసుకుంటున్నాను. ఎంత ఆలస్యం చేసినా, ఇప్పటికల్లా చేరాలే అని అనిపించింది నాకు.

ఒక్కసారి, ఎక్కణ్ణించో భయం వెన్నులోంచి జరజరా పాకింది. భయంతో కొట్టుకుంటున్న నా గుండె వేగం నాకే అపశకునంలా అనిపించింది.

నాలుగు రోజుల్నుంచి మనూకి ఆరోగ్యం బాగాలేదు. అయినా "గురుమీత్ వచ్చాడా" అని పదిసార్లు బలవంతంగా కళ్ళు విప్పదీసి అడిగింది.

గురుమీత్ ఈ రోజు షాపుకెందుకు కెళ్లాడు? వెళ్తూంటే చూస్త నేనెలా ఊర్కున్నాను? కోపంతో శిక్కులని చంపుతున్నారని తెలుసు. అయినా ఎందుకు ఆపలేదు?

"మనూ! నేనోసారి షాపు వరకూ వెళ్తాను" ఆందోళనగా అన్నాను.

"తొందరగా రండి. ఒక్క క్షణం ఆలస్యం అయినా నేను భరించలేను"అంది ఏడుస్తూ.

"అలాగే" అన్నట్లు పడుకుని ఉన్న ఆమె తలని నిమిరివెళ్లాను. వెళ్తూ వంటవాణ్ణి పిలిచి మనూ దగ్గరే ఉండమన్నాను.

మెట్లు దిగి, కాంపౌండ్ దాటి రోడ్డు మీదకొచ్చాను. ఈ రోడ్డు మలుపు తిరిగాక, ఎడంవైపు రెండో రోడ్డులాటి సందులో ఉంది గురుమీత్ షాపు.

మనుషులతో, వాహనాల మోతలతో రోడ్డు చాలా హడావుడిగా గొడవగా వుంది.

మలుపు తిరిగాను.

పోలీసు వాళ్లు రోడ్డుకి వారగా ఉన్నాయి.

భయం భయంగా అడుగులు వేస్తున్నాను.

మొదటి రోడ్డు వచ్చింది. ఆ రోడ్లోకి చూశాను. ఆ రోడ్లో సగం షాపులు శిక్కులవి. ఆ రోడ్డు కూడా సందులాగా సన్నగా వుంది. డెడ్ ఎండ్. అందులో ఏం దుకాణాలు ఉన్నాయో నాకు బాగా తెలుసు. బట్టల దుకాణాలు, పుస్తకాల దుకాణాలు, ఎలక్ట్రికల్ గూడ్స్‌షాపు. అన్ని దుకాణాల్లో సామానంతా చెల్లాచెదురుగా ఆ దుకాణాల

ముందు పడివుంది. వైర్లు కాలుతున్న వాసన. చాలా ఘోరంగా ఉంది...ఏడుస్తున్న శిక్కులు...

భయంగానే నడుస్తున్నాను.

రెండో రోడ్లోకి వచ్చాను. అది కూడా డెడ్ ఎండ్‌సందు. ఆ చిన్న రోడ్లో ఏమీ కనబడ్డం లేదు.

అప్పుడే టియర్‌గాస్ వదుల్తున్నట్టున్నారు. ఒకళ్ళని తోసుకుంటూ మరొకళ్ళు పరుగెడ్తున్నారు. లోపలికి వెళ్ళకుండా మూసిఉన్న మొదటి షాపుషట్టర్‌ని ఆనుకుని నిల్చున్నాను.

లాఠీలతో కొడ్తున్న పోలీసులు.

ప్రాణభయంతో పరుగెడ్తున్న ప్రజలు.

పొగల్లోంచి మసక మసగ్గా కనబడ్తున్న ప్రపంచం.

ఆదుర్దాగా, ఆత్రుతగా గురుమిత్ షాపు కనబడ్తుందేమోనని చూశాను. వస్తువులు కాల్తున్న మంటల్లో వాటి పొగల్లో, టియర్‌గాస్ పొగలో ఏం కనబడ్లేదు.

కళ్ళు మూసుకున్నాను.

ఎందుకో జలియన్‌వాలాబాగ్‌లో ఇదే విధంగా జరిగి ఉంటుందని అని అనిపించింది.

కానీ, ఆ రోజున అందరి గొంతుకలో ఒక్కటే ఆక్రందన.

ఆ రోజున రక్తం ప్రవహించింది. ఆ ప్రవహించిన రక్తం లోంచి వచ్చింది ఒకే రకమైన ఆవేశం. మరి ఇది అలాంటిది కాదు.

కళ్ళు తెరవలేదు. పరుగెడుతున్న మనుష్యుల శబ్దం ఆగిపోయింది. పోలీసులు బూట్లు శబ్దాలు, ఫైర్ ఇంజన్లో కాలుతున్న సామాన్లని ఆర్పుతున్న నీళ్ళ శబ్దాలు.

ఓ పది నిమిషాలు అలాగే ఉండిపోయాను.

కళ్ళు తెరిచాను. వాతావరణంలోని పొగలో సాంద్రత తగ్గింది. క్రమంగా అన్నీ కనబడ్తున్నాయి.

ఆ పొగలకి కళ్ళు మండుతున్నాయి. నీళ్ళు కారుతున్నాయి. అలాగే నీళ్ళు నిండిన కళ్ళతో ఆతృతగా గురుమిత్ షాపువైపు చూశాను. ఒకే మేకుతో, గాలిలో వేళ్ళాడుతున్న "మంజిత్ ఎలక్ట్రానిక్స్" అన్న బోర్డు కనబడింది.

కళ్ళు తిరిగాయి.

క్షణం పాటు అలాగే నిల్చుని గురుమీత్ షాపు వైపు నడిచాను.

చెల్లా చెదరైన రేడియోలు, కాసెట్లు, కాలుతున్న సామను దగ్గర ఏడుస్తున్న శిక్కులు.

ఆ రోడ్లో గురుమీత్ షాపు కాకుండా ఇంకా నాలుగు శిక్కుల షాపులున్నాయి.

రెండడుగులు ముందుకేశాను.

ప్రపంచం అంతా నిశ్శబ్దంగా అయినట్లనిపించింది.

శిక్కుల ఏడుపులుకానీ, తిట్లు కానీ, వినిపించడం లేదు.

పైకెగుస్తున్న మంటల్ని ఆర్పుతున్న నీళ్ళ శబ్దాలు వినిపించడం లేదు. ఇంకా అక్కడే ఉన్న మనుష్యుల్ని తిడ్తూ, అదరగొడ్తున్న పోలీసులు కనబడ్డం లేదు.

పొగల్లోంచి ప్రతిధ్వనిస్తున్న ఆర్తనాదాలు వినబడ్తున్నాయి.

నడి రోడ్లో కాలిపోతున్న మానవత్వం కనబడ్తోంది.

కాల్వలై కట్టిన రక్తంలోంచి రాక్షసత్వపు వాసనలు వస్తున్నాయి.

ఓ పోలీసు నన్నాపుతున్నాడు. చేయి విదుల్చుకొని శవంలా నడుస్తున్నాను. చెదిరిన సామాన్ల మధ్య కాలుతున్న టీవి, రేడియోల మధ్య నా పెద్దకొడుకు గురుమీత్ పడివున్నాడు. మామూలుగా కాదు, నిర్జీవంగా అచేతనంగా.

టర్బన్ ఊడిపోయింది. పొడుగాటి జుట్టు చెదిరిపోయింది. బట్టలన్నీ చిరిగివున్నాయి. కారుతున్న రక్తంతో తడిసిపోయిన శరీరంతో.

స్వాతంత్ర్యం వచ్చి నలభై ఏళ్లయినా కూడా అందరం కలిసి ఓ మెయిన్ స్ట్రీంలా నడుద్దాం, అన్నవేళ్ల నాటుకోలేని ఈ మట్టిలో, అన్యాయంగా, అమాయకంగా, ఏ విధమైన రాజకీయాల్తో సంబంధం లేనివాడు కలిసిపోయాడు.

ఒక్కసారి వాడిమీద పడి పొర్లిపొర్లి ఏడ్చాను. ఎవరో నన్ను పట్టుకుని లేవదీస్తున్నారు. కర్ఫ్యూ పెడ్తున్నారుట వెళ్లిపొమ్మని గొడవ చేస్తున్నారు.

అంబులెన్స్ వచ్చింది హాస్పిటల్‌కి పోస్టుమార్టంకి.

అన్నీ అయ్యాక, అంతా నాశనం జరిగాక ఈ ఫార్మాలిటీస్ దేనికో.

ఢిల్లీలో ఇల్లు, కారు అన్నీ అమ్మేశాను.

హైదరాబాద్‌కి ప్రయాణం కట్టాం. అప్పుడు ఈ దేశం ఎంతో చిన్నగా

అయిపోయినట్లనిపించింది. మన దేశానికి ఎల్లలు హిమాలయాలు, హిందూ మహాసముద్రం, బంగాళాఖాతం కాదు. భిన్నమైన వివిధ మతాలున్న మనదేశం ఎల్లలు తిరిగి రాయబడ్డాయా అనిపిస్తోంది, ఈ మత పిశాచాలతో, ప్రాంతీయ ధోరణులతోనూ.

ఆంధ్ర దేశానికి తమిళనాడూ పంజాబ్‌కి హర్యానా...

పాతికేళ్ల క్రితం ఇదేదారిలో, ఇలాటి ట్రెయిన్‌లో ప్రయాణం చేశాను. అప్పుడు ఒంటరిగా వెళ్తున్నాను. ఆ రోజున భవిష్యత్తును గూర్చి బంగారు కలలు, రేపు మీద ఆసక్తి, నా భవిష్యత్తు అంతా నా కొడుకులే.

కానీ ఇప్పుడు...వాళ్లే లేనప్పుడు భవిష్యత్తు ఏమిటీ?

పాతికేళ్ళ నుంచి నా జీవితంలోని ప్రతి నిమిషంలోని కష్టం, సుఖం పంచుకున్న మనూని హైదరాబాద్ మెంటల్ హాస్పిటల్‌లో చేర్చి ఆమెకోసం బ్రతకాలి.

నా కెదురు బెర్త్‌లో ఉన్న మనిషి రేడియో ఆన్‌చేశాడు మామూలుగా, రోజూలాగే దేశభక్తి పాట వినిపిస్తోంది.

ఇందిరాగ్గాంధీ పోయాక, రోజూ రేడియోలో, టివీలో దేశభక్తి పాటలే వస్తున్నాయి.

ఆపస్ మే బైర్ రఖనా!
హిందీ హైహం, హిందీ హైహం ఏవతన్‌కీ
హిందూస్ తాన్ హమారా
సారే జహాసే అచ్చా.

అన్న మధురమైన ఇక్బాల్ పాటలో నాకెక్కడో జీర...ఏదో అపశృతి వినబడ్తోంది.

✧ 4-2-88 ఆంధ్రభూమి వారపత్రిక ✧

ఇందిరాగాంధి మరణానంతరం హిమాచల్ ప్రదేశ్‌లో మేము చూసిన దృశ్యాల ఆధారంగా రాసికథ ఇది.

కథా నిలయం
5975
శ్రీకాకుళం